# సాక్షి కాకినాడ

బుధవారం | 15 | మార్చి | 2023






**ప్రైవేటు బడుల్లోనూ ఉచితాసనం**


ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టాన్ని పక్కాగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. - 8లో



**ఆలయ విద్యాసంస్థల్లో హిందూ ధర్మం**

అన్నవరం దేవస్థానం విద్యాసంస్థల్లో విద్యార్థులకు హిందూ ధర్మం, ఆచారసంప్రదాయాలు నేర్పాలని కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి సూచించారు. - 8లో

**డెల్టాలకు 7,080 క్యూసెక్కులు**



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 7,080 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,170, మధ్య డెల్టాకు 1,410, పశ్చిమ డెల్టాకు 3,500 క్యూసెక్కులు వదిలారు.

## న్యూస్‌రీల్

### నేడు తునికి కంచి పీఠాధిపతి

తుని రూరల్: కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి బుధవారం తుని మండలంలో విస్తృతంగా పర్యటించనున్నారు. సాయంత్రం 5 గంటలకు కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమాన్ని ఆయన సందర్శిస్తారని ఆశ్రమ పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి తెలిపారు. సాయంత్రం 5.30 గంటలకు ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానాన్ని, ఇటీవల నిర్మించిన శ్రీవారి పుష్కరిణిని శంకర విజయేంద్ర సరస్వతి సందర్శిస్తారని ఆలయ చైర్మన్ కోలా భీమేశ్వరరావు పేర్కొన్నారు. ఎస్.అన్నవరంలోని రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా నివాసానికి చేరుకుని ఆయన కుటుంబ సభ్యులను ఆశీర్వదిస్తారు. అనంతరం తునిలో పర్యటిస్తారు.

### సత్తెమ్మతల్లికి బోనాలు



బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

జగ్గంపేట: స్థానిక సంత మార్కెట్‌లో వేంచేసిన సత్తెమ్మతల్లి జాతర మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఉత్సవాల్లో భాగంగా 250 మంది మహిళలు బోనాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. యాదవ సంఘం జిల్లా కార్యదర్శి వైభోగుల కొండబాబు యాదవ్ తదితరుల ఆధ్వర్యంలో మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించారు. వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పెద్దాడ రాజబాబు అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

### ఓటర్ల జాబితా, పోలింగ్ స్టేషన్లు సిద్ధం

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): జిల్లాలో ఇటీవల మరణించిన సర్పంచ్, 27 వార్డు సభ్యుల ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితా, పోలింగ్ స్టేషన్ల పబ్లికేషన్ పూర్తి చేశారు. తాళ్లరేవు మండలం జార్జిపేట సర్పంచ్ పదవికి, తాళ్లరేవు 11వ వార్డు; గండేపల్లి మండలం పి.నాయకంపల్లి 1వ వార్డు; గొల్లప్రోలు మండలం చెందుర్తి 5వ వార్డు, కొడవలి 12వ వార్డు; కాజులూరు మండలం గొల్లపాలెం 10వ వార్డు; కరప మండలం గొడ్డటిపాలెం 6వ వార్డు, నడకుదురు 7వ వార్డు; కిర్లంపూడి మండలం పాలెం 10వ వార్డు, రాజుపాలెం 6వ వార్డు; పెదపూడి మండలం కాండ్రేగుల 3వ వార్డు; పెద్దాపురం మండలం దివిలి 7వ వార్డు, గోరింట 4వ వార్డు, జె.తిమ్మాపురం 10వ వార్డు; ప్రతిపాడు మండలం గజ్జనపూడి 6వ వార్డు; రౌతులపూడి మండలం ఎ.మల్లవరం, 5వ వార్డు, జల్దాం 7వ వార్డు, కొత్తూరు 4వ వార్డు; సామర్లకోట మండలం చంద్రపాలెం 4వ వార్డు, పవర 5వ వార్డు, వేట్లపాలెం 14వ వార్డు; శంఖవరం మండలం అచ్చంపేట 7వ వార్డు, కత్తిపూడి 5వ వార్డు; తొండంగి మండలం తొండంగి 13వ వార్డు; తుని మండలం తిమ్మాపురం 2వ వార్డు; యు.కొత్తపల్లి మండలం పొన్నాడ 5వ వార్డుకు ఓటర్ల జాబితా, పోలింగ్ స్టేషన్ల పబ్లికేషన్ పూర్తి చేశారు. ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసిన వెంటనే ఆయా గ్రామాల్లో ఎన్నికలు నిర్వహిస్తామని జిల్లా పంచాయతీ అధికారి ఆర్.విక్టర్ తెలిపారు.

### బాలుడి వైద్యానికి రూ.లక్ష వితరణ



బాలుడి తండ్రికి రూ.లక్ష అందజేస్తున్న కంబాల శ్రీనివాసరావు మిత్రబృందం

గోకవరం: గ్రామంలో అరుదైన బోన్‌మేరో వ్యాధితో బాధ పడుతున్న రెండున్నరేళ్ల బాలుడు అక్షయ్‌రామ్ వైద్యానికి గ్రామానికి చెందిన కంబాల శ్రీనివాసరావు రూ.లక్ష ఆర్థిక సహాయం చేశారు. బాలుడి వైద్యానికి రూ.30 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం బాలుడు తమిళనాడులోని వేలూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న కంబాల శ్రీనివాసరావు విషయం తెలుసుకుని రూ.లక్ష ఆర్థిక సాయం చేశారు. ఈ నగదును స్థానిక దేవీచౌక్ ఆలయంలో ఆయన మిత్రబృందం ద్వారా బాలుడి తండ్రి సతీష్‌కు మంగళవారం అందజేశారు.

# గోదావర్రీ వేళా..
# వరికి ఊపిరి

- తగ్గిన సహజ జలాల లభ్యత
- ధవళేశ్వరం బ్యారేజీ వద్ద పడిపోతున్న నీటిమట్టం
- సాగునీరు సమర్థంగా అందేలా ప్రభుత్వ యంత్రాంగం చర్యలు
- ఇప్పటికే క్రాస్ బండ్‌ల ఏర్పాటు
- సీలేరు నుంచి అదనంగా జలాలు



రాజమహేంద్రవరం వద్ద గోదావరిలో నీరు తగ్గి, బయటపడిన ఇసుక మేటలు

**వారం రోజులుగా కాటన్ బ్యారేజీ వద్ద నీటి పరిస్థితి ఇదీ (క్యూసెక్కులలో)**

| తేదీ | ఇన్‌ఫ్లో | సీలేరు నుంచి | సహజ జలాలు | డెల్టాకు విడుదల | నీటిమట్టం (అడుగుల్లో) |
|---|---|---|---|---|---|
| 07.03 | 7,051 | 6,496 | 555 | 7,350 | 6.85 |
| 08.03 | 6,981 | 7,413 | -432 | 7,350 | 6.70 |
| 09.03 | 6,909 | 6,010 | 899 | 7,350 | 6.50 |
| 10.03 | 6,763 | 6,120 | 643 | 7,350 | 6.25 |
| 11.03 | 6,836 | 5,674 | 1,162 | 7,350 | 6.00 |
| 12.03 | 6,769 | 5,600 | 1,169 | 7,350 | 5.75 |
| 13.03 | 6,665 | 6,730 | -65 | 7,160 | 5.50 |
| 14.03 | 6,767 | 6,761 | 6 | 7,080 | 5.30 |

సాక్షి డెస్క్, రాజమహేంద్రవరం: ఆక్సిజన్ అందక ఇబ్బంది పడుతున్న రోగి ప్రాణాన్ని కృత్రిమంగా ప్రాణావాయువు ఇచ్చి వైద్యులు నిలబెడతారు. సరిగ్గా ఇప్పుడు అదే రీతిలో.. నీరు సరిగ్గా అందక వాడుతున్న వరిపైరుకు జలసిరులు అందించి, ఊపిరి పోసేందుకు ప్రభుత్వ యంత్రాంగం అహరహం శ్రమిస్తోంది. రైస్ బౌల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌గా పేరొందిన గోదావరి డెల్టాకు.. రబీ సీజన్ చివరి దశలో నీటి లభ్యత తగ్గడం.. అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలు చూడటం ఏటా మామూలే. ఈసారీ ఇటువంటి పరిస్థితే నెలకొంది. దీనిని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం రకరకాల ప్రత్యామ్నాయాలను అవలంబిస్తోంది. రబీ రైతును గట్టెక్కించేందుకు ఉన్న అన్ని అవకాశాలనూ సమర్థంగా వినియోగించుకుంటోంది.

**ఈసారీ గోదా'వర్రీ'**

కాటన్ బ్యారేజీ కింద తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో సుమారు 3.80 లక్షల ఎకరాల్లో రబీ సాగు జరుగుతోంది. ప్రస్తుతం వరి పైరు చాలాచోట్ల గింజ పాలుపోసుకునే దశలో ఉంది. ఈ సమయంలో పంటకు నీటి తడి ఎక్కువగా అవసరం.

సరిగ్గా ఇదే సమయంలో సహజ జలాల లభ్యత తగ్గడం.. వేసవి ఎండల తీవ్రతతో ఉన్న నీరు అత్యధికంగా ఆవిరి అవుతూండటంతో ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద గోదావరి నీటి మట్టం రోజురోజుకూ గణనీయంగా పడిపోతోంది. నీరు తగ్గిపోయి, రాజమహేంద్రవరం వద్ద గోదావరిలో ఇసుక మేటలు తేలుతున్నాయి. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద సాధారణ నీటిమట్టం 10.90 అడుగులు ఉండాలి. ప్రస్తుతం అందులో సగానికి పైగా తగ్గిపోయింది. మంగళవారం నాటికి బ్యారేజీ వద్ద నీటిమట్టం 5.30 అడుగులు మాత్రమే ఉంది.

**డెల్టా శివారుపై ప్రత్యేక శ్రద్ధ**

తగినంత నీటి లభ్యత లేకపోవడంతో గోదావరి డెల్టా శివారున ఉన్న తాళ్లరేవు, కాట్రేనికోన, ఉప్పలగుప్తం తదితర మండలాల్లోని భూములకు నీరు తగినంతగా అందడం లేదు. అక్కడి రైతులు సాగు నీటి కోసం ఆందోళనలు చేస్తున్నారు. ఈ ప్రాంతంపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది.



ఉప్పలగుప్తం మండలం కూనవరం మేజర్ డ్రెయిన్‌పై నిర్మించిన క్రాస్‌బండ్

### ముందస్తు ప్రణాళికతో..

- పరిస్థితులను ముందుగానే అంచనా వేసిన రాష్ట్ర ప్రభుత్వం గోదావరి డెల్టా రైతులను గట్టెక్కించేందుకు నెల రోజుల ముందే రంగంలోకి దిగింది. గోదావరిలో నీటి లభ్యత తక్కువగా ఉంటుందని అంచనా వేసి, గత నెల మొదటి వారం నుంచే వంతుల వారీ విధానం ఆరంభించింది.
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కొన్నాళ్లుగా సీలేరు నుంచి ప్రతి రోజూ 7,500 క్యూసెక్కుల వరకూ నీటిని గోదావరి డెల్టాకు విడుదల చేస్తున్నారు. వారం రోజులుగా డొంకరాయి నుంచి 2,500, పొల్లూరులో విద్యుత్ ఉత్పత్తి అనంతరం 4,300 క్యూసెక్కుల చొప్పున డెల్టా సాగు అవసరాలకు అందిస్తున్నారు. బ్యారేజీ వద్దకు సహజ జలాలు తగినంతగా రానప్పటికీ సీలేరు నుంచి రప్పిస్తూండటం కాస్త ఉపశమనంగా ఉంది.
- దీంతోపాటు క్రాస్‌బండ్ల ఏర్పాటుకు, నీరు తోడేందుకు డీజిల్ ఖర్చులకు, ఇతర అత్యవసర పనులకు రూ.11.50 కోట్లు కేటాయించింది. ఇప్పటికే కోనసీమ జిల్లాలో 90 చోట్ల క్రాస్‌బండ్లు ఏర్పాటు చేశారు.
- ఏప్రిల్ మొదటి వారం ముగిసే వరకూ డెల్టాకు సాగునీరు అందించాల్సి ఉంటుంది. దీనిని అంచనా వేస్తున్న అధికారులు ఆ దిశగా చర్యలు చేపడుతున్నారు. అవసరమైనచోట్ల సమస్య పరిష్కారానికి తక్షణం స్పందిస్తున్నారు. ముఖ్యంగా డెల్టా శివారు ప్రాంతాలు ఎక్కువగా ఉన్న కోనసీమ జిల్లాలో తరచుగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నారు. రైతుల విజ్ఞప్తులు, మీడియాలో వస్తున్న కథనాలపై వెంటనే స్పందిస్తూ, అవసరమైన చర్యలు చేపడుతున్నారు. రైతులు ఆందోళన చెందనవసరం లేదని, అవసరమైన మేరకు నీటిని సమకూరుస్తామని అధికారులు చెబుతున్నారు.

### ఎద్దడి లేకుండా నీరు అందిస్తున్నారు



దాళ్వాలో ఇప్పటి వరకూ సాగునీటి ఎద్దడి రాలేదు. వంతుల వారీ విధానంలో నీరు సక్రమంగానే అందిస్తున్నారు. ప్రస్తుతం వరి ఈనిక దశలో ఉంది. ఈ సమయంలో సాగునీరు చాలా కీలకం. ఈసారి వంతు పూర్తి స్థాయిలో సాగునీరు ఇచ్చారు. మరో రెండు వంతుల పాటు నీరందిస్తే దాళ్వా సీజన్ గట్టెక్కుతుంది.

– యాళ్ల మామాజీ, రైతు, బెండమూర్లంక

### రబీని గట్టెక్కిస్తాం

అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ గోదావరి డెల్టాలో రబీని గట్టెక్కిస్తాం. సీలేరు నుంచి ప్రతి రోజూ సుమారు 6 వేల క్యూసెక్కులకు పైగా విడుదల చేస్తున్నారు. ఈ నెలాఖరు వరకూ డెల్టాలో సాగునీటి అవసరాలు ఉంటాయి. ప్రస్తుతం సీలేరు నుంచి వస్తున్న నీటిని సద్వినియోగం చేసుకుంటూ మూడు డెల్టాలకు ఇబ్బందులు లేకుండా విడుదల చేస్తున్నాం.

– జి.శ్రీనివాసరావు, ఎస్‌ఈ, ఇరిగేషన్ సర్కిల్, ధవళేశ్వరం

## ఘనంగా సత్యదేవుని ఆలయ పునఃప్రతిష్ఠా మహోత్సవం



ప్రధానాలయంలో సత్యదేవుని దర్శిస్తున్న భక్తులు

అన్నవరం: రత్నగిరి వాసుడు శ్రీ సత్యదేవుని ఆలయ పునఃప్రతిష్ఠా మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. నూతన ఆలయానికి కలశ ప్రతిష్ఠాపన జరిగి మంగళవారంతో 11 సంవత్సరాలు పూర్తయిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లకు ఉదయం లక్ష తులసి, కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం పండితులు వేదాశీస్సులు అందజేశారు. వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, రమేష్, ప్రధానార్చకులు ఇంద్రగంటి నరసింహమూర్తి, కోట శ్రీను, అర్చకులు ఇంద్రగంటి వేంకటేశ్వర్లు, యడవిల్లి ప్రసాద్, వ్రత పురోహితులు ఈ పూజలు నిర్వహించారు. పునఃప్రతిష్ఠా మహోత్సవాల సందర్భంగా ఆలయాన్ని రంగురంగుల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామివారి ధ్వజస్తంభం, ఆలయ గోడలు, ద్వారాలను పూలమాలలతో అలంకరించారు. సుమారు పది వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించి, పూజలు చేశారు. సత్యదేవుని ఆలయాన్ని డ్రోన్‌తో చిత్రీకరించారు. ఆ దృశ్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

**నిండిపోయిన సత్యదేవుని ప్రధాన హుండీ**

సత్యదేవుని ఆలయంలోని ప్రధాన హుండీ కానుకలతో నిండిపోయింది. దీంతో దానికి మంగళవారం సీల్ వేశారు. వివాహాల సీజన్ కారణంగా కొద్ది రోజులుగా ఆలయానికి భక్తులు పోటెత్తుతున్నారు. హుండీల్లో దండిగా కానుకలు సమర్పిస్తున్నారు. దేవస్థానంలో ప్రతి నెలా హుండీల ఆదాయం లెక్కిస్తారు. హుండీలను జనవరి 27న తెరిచారు. ఫిబ్రవరి నెలలో లెక్కించలేదు. దీంతో హుండీలు నిండిపోయాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపు సందర్భంగా స్వామివారి హుండీలను ఈ నెలాఖరున తెరిచి ఆదాయం లెక్కించే అవకాశం ఉందని దేవస్థానం వర్గాలు చెబుతున్నాయి.

## 4.62 లక్షల మందికి ఆల్బెండజోల్ మాత్రలు

- జాయింట్ కలెక్టర్ ఇలక్కియ
- నులిపురుగుల నివారణ కార్యక్రమం ప్రారంభం

కాకినాడ: జిల్లాలోని సుమారు 4.62 లక్షల మంది చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు అందించనున్నామని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా అన్నారు. స్థానిక ఆనంద భారతి మున్సిపల్ హైస్కూల్‌లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఈ మాత్రలు వేసుకోవడం ద్వారా బాలబాలికల్లో రక్తహీనత లోపాన్ని అధిగమించవచ్చని అన్నారు. ఏదైనా కారణం వలన ఈ మాత్రలు వేసుకోని వారికి ఈ నెల 18న తిరిగి పంపిణీ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఆర్.రమేష్, డీఐఓ డాక్టర్ ఐ.ప్రభాకర్, రాష్ట్రీయ బాల ఆరోగ్య స్వాస్థ్య కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ కె.సత్యనారాయణ, డిప్యూటీ డీఈఓ ఆర్‌జే డేనియల్‌రాజు, నగరపాలక సంస్థ ఆరోగ్య అధికారి డాక్టర్ కె.పృథ్వీచరణ్ తదితరులు పాల్గొన్నారు.





విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న జేసీ ఇలక్కియ

**పక్కాగా లింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలు**

జిల్లాలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ (పీసీ, పీఎన్‌డీటీ) చట్టం పటిష్ట అమలుకు చర్యలు తీసుకోవాలని జేసీ ఇలక్కియ అధికారులను ఆదేశించారు. ఈ చట్టం అమలుపై జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ, సలహా కమిటీ సమావేశం మంగళవారం కలెక్టరేట్‌లో జరిగింది. స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్, రెన్యువల్, డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలు తదితర అంశాలను అధికారులు జేసీకి వివరించారు. జిల్లాలో గత ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకూ అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రాల్లో 84 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించామని చెప్పారు. సమావేశానికి అధ్యక్షత వహించిన జేసీ మాట్లాడుతూ, సంబంధిత శాఖల అధికారులు.. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ అధికంగా తనిఖీలు చేట్టాలని ఆదేశించారు. స్కానింగ్ సెంటర్ల చిరునామా, మెషీన్ మార్పులు, క్లోజర్ అనుమతులకు సంబంధించిన ఆరు దరఖాస్తులకు సమావేశం ఆమోదం తెలిపింది. అసిస్టెంట్ రీప్రొడక్టివ్ టెక్నాలజీ (ఏఆర్‌టీ) సెంటర్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ఒక దరఖాస్తును ఆమోదించింది. జిల్లాలో మాతాశిశు మరణాలు సంభవించకుండా ప్రతి దశలోనూ వైద్య, ఆరోగ్య, మహిళా, శిశు సంక్షేమ శాఖ సిబ్బంది అప్రమత్తతంగా వ్యవహరించాలని ఇలక్కియా ఆదేశించారు. మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి అవసరమైన అన్ని వైద్య పరీక్షలూ చేయించుకునేలా గ్రామస్థాయిలో ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో ఫీవర్ సర్వే పటిష్టంగా నిర్వహించాలని జేసీ ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఆర్.రమేష్, ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పీబీ విష్ణువర్ధిని, డీఐఓ డాక్టర్ ప్రభాకర్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ డి.హేమలతాదేవి తదితరులు పాల్గొన్నారు.

# పరీక్షా కాలం

- నేటి నుంచి ఇంటర్.. వచ్చే నెల 3 నుంచి టెన్త్ పరీక్షలు
- విద్యార్థులు ఒత్తిడిని అధిగమించాలి
- మానసిక, శారీరక ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి
- నిపుణుల సూచనలు

కాకినాడ సిటీ: ఇటు విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు.. అటు ఉపాధ్యాయులు, అధికారులకు నేటి నుంచి పరీక్షా కాలమే.. బుధవారం నుంచి ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. అలాగే వచ్చే నెల 3 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. అదే సమయంలో మిగిలిన తరగతుల వారికి కూడా వార్షిక పరీక్షలు.. అనంతరం వివిధ పోటీ పరీక్షలు జరుగుతాయి. ఈ నేపథ్యంలో తమ పిల్లలు అందరికంటే మెరుగైన ఫలితాలు సాధించాలని ఇటు తల్లిదండ్రులు, అధ్యాపకులు, విద్యాసంస్థల అధిపతులు ఆశిస్తూంటారు. ఈ పరిస్థితుల్లో విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనవుతుంటారు. దీనికి తోడు ప్రస్తుతం ఎండల తీవ్రత పెరుగుతోంది. చాలా స్కూళ్లు, కాలేజీలు, హాస్టళ్లలో తాగునీటి ట్యాంకులను రోజుల తరబడి శుభ్రం చేయరు. దీంతో వీటిలో ఈకోలి, సాల్మొనెలా, షిజెల్లా, లిజియోనెల్లా తదితర బ్యాక్టీరియాలు చేరుతాయి. అత్యధిక పాఠశాలలు, కాలేజీల్లోని విద్యార్థులు ట్యాంకుల్లో నిల్వ చేసిన నీటినే తాగుతూంటారు. ఉదయం వండిన ఆహారం మధ్యాహ్నానికి పాడైపోతుంది. దీనిని తిన్న వారు తర్వాత వాంతులు, విరేచనాలు, టైఫాయిడ్ జ్వరాల బారిన పడుతూంటారు. ఎండలో ఆడటం ద్వారా వడదెబ్బకు గురవుతుంటారు. కీలకమైన పరీక్షల సమయంలో పిల్లలు అస్వస్థతకు గురవుతుండడం, అనారోగ్యం కారణంగా చదవలేకపోవడం, చదివిన అంశాలు గుర్తుండకపోవడం, పరీక్షలో ఫెయిలైతే.. తల్లిదండ్రులతో పాటు బంధువులు, ఇరుగు పొరుగువారు చులకనగా చూస్తారనే భయంతో ఒత్తిడికి లోనవుతుంటారు. దీనిని అధిగమించాలని నిపుణులు సూచిస్తున్నారు.



పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

**పిల్లల్ని పట్టించుకోండి**

మారిన ఆధునిక జీవనంలో చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లల పరిస్థితిని పట్టించుకోవడం లేదు. ఉద్యోగం, వ్యాపారం ఇతర పనుల్లో తండ్రి బిజీగా ఉంటే, ఇంట్లో ఉన్న కొంతమంది తల్లులు టీవీలు, సెల్‌ఫోన్లకు అతుక్కుపోతున్నారు. మరి కొంత మంది తల్లిదండ్రులు ఏకంగా ఇంట్లో పిల్లల సమక్షంలోనే తరచూ ఘర్షణ పడుతున్నారు. కనీసం పిల్లలు వేళకు నిద్రపోతున్నారా? లేస్తున్నారా? ఏం తింటున్నారు? ఏం చూస్తున్నారు? ఏం ఆలోచిస్తున్నారో కూడా పట్టించుకోవడం లేదు. తల్లిదండ్రుల ఈ ప్రవర్తన కూడా విద్యార్థుల ఏకాగ్రతను పరోక్షంగా దెబ్బ తీస్తోంది. తల్లిదండ్రులు ఇంట్లో స్నేహపూర్వకంగా ఉంటూ, పిల్లల ఆలనాపాలనా చూడటం ద్వారా ఒత్తిడిని జయించేందుకు వారికి తోడ్పడవచ్చని నిపుణులు అంటున్నారు.

### వార్షిక పరీక్షలు ఇలా..

**ఇంటర్మీడియెట్ ఫస్టియర్**
నేటి నుంచి ఏప్రిల్ 3 వరకూ

**సెకండియర్**
ఈ నెల 16 నుంచి ఏప్రిల్ 3 వరకూ

సమయం : ఉదయం 9 నుంచి 12 గంటల వరకూ

హాజరయ్యే విద్యార్థులు : 41,817

పరీక్ష కేంద్రాలు : 60

**టెన్త్** : వచ్చే నెల 3 నుంచి 18 వరకూ

సమయం : ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటలు

హాజరయ్యే విద్యార్థులు : 29,988

పరీక్ష కేంద్రాలు : 136

### తేలిగ్గా జీర్ణమయ్యే ఆహారం ఇవ్వాలి



పరీక్షల సమయంలో తేలిగ్గా జీర్ణమయ్యే ఆహార పదార్థాలను వండి పెట్టాలి. మసాల వేపుళ్లు, ఆయిల్ ఫుడ్‌కు బదులు.. అప్పుడే వండి వార్చిన పప్పు, సాంబారు, ఆకుకూరలు, కాయగూరలు, మజ్జిగ వంటివి ఎక్కువగా అందించాలి. ఉదయం, సాయంత్రం, గుడ్డుతో పాటు పండ్ల రసాలు, సలాడ్స్ ఇవ్వాలి. వేళకు నిద్రపోయేలా చూడాలి.

– డాక్టర్ ఐ.ప్రభాకర్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి

### వేళకు నిద్రపోవాలి



పరీక్షల సమయంలో ఎక్కువ సేపు చదవాలనే ఉద్దేశంతో చాలా మంది రాత్రి పొద్దుపోయిన తర్వాత కూడా మేల్కొనే ఉంటారు. ఇలా గంటల తరబడి మేల్కొని ఉండటం వలన చదివిన అంశాలు గుర్తుండవు. వేళకు నిద్రపోయి, వేళకు మేల్కొంటే మానసిక ప్రశాంతత లభిస్తుంది. చదివిన అంశాలు మెదడులో నిక్షిప్తమవుతాయి. ఎంతసేపు చదివామనేది కాకుండా ఎంత ఇష్టంగా చదివామనేది కీలకం. పిల్లల మానసిక స్థితిని అంచనా వేయకుండా చదువు విషయంలో వారిపై ఒత్తిడి తేవడం సరికాదు. సాధ్యమైనంత వరకూ పిల్లలను మోటివేట్ చేయాలి. సమాజంపై వారికి అవగాహన కల్పించినప్పుడే మంచి ఫలితాలు వస్తాయి.

– ఏపీజే విను, సైకాలజిస్ట్, కాకినాడ

## క్లుప్తంగా

### జేఎన్‌టీయూకే కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు



ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్‌ను సత్కరిస్తున్న వీసీ ప్రసాదరాజు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూ కాకినాడ ఇంజినీరింగ్ కళాశాలకు నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు వచ్చిన సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణ ప్రసాద్‌ను మంగళవారం వర్సిటీ వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు సత్కరించారు. గత ఏడాది సెప్టెంబర్ 2,3,4 తేదీలలో ఎన్‌బీఏ బృందం కళాశాలను పరిశీలించింది. బీటెక్ కోర్సులైన సివిల్, ఈఈఈ, ఈసీఈ, సీఎస్ఈ, మెకానికల్ విభాగాలకు జూన్ 30వ తేదీ 2025 వరకూ ఎన్‌బీఏ గుర్తింపు కల్పించారన్నారు. ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్‌తో పాటు సివిల్ హెడ్ కోటేశ్వరరావు, ఈఈఈ హెడ్ రవీంద్ర, ఈసీఈ హెడ్ బీటీ కృష్ణ, సీఎస్ఈ హెడ్ శ్రీనివాసరావులను అభినందించి పీజీ ప్రోగ్రాంకు ఇదే స్ఫూర్తితో ఎన్‌బీఏ గుర్తింపు వచ్చేలా కృషి చేయాలని కోరారు.

### వచ్చే నెలలో జేఎన్‌టీయూకే వార్షికోత్సవం



స్నాతకోత్సవంపై సమీక్ష నిర్వహించిన వీసీ ప్రసాదరాజు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూకే 9వ వార్షికోత్సవం ఏప్రిల్ 3వ వారంలో నిర్వహిస్తున్నట్లు వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. వర్సిటీ వీసీ సమావేశపు హాల్లో మంగళవారం స్నాతకోత్సవ నిర్వహణపై డైరెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. స్నాతకోత్సవంలో భాగంగా 2020-21,2021-22 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిగ్రీలు అందజేస్తామని, ముఖ్య అతిథులుగా గవర్నర్ అబ్దుల్‌నజీర్, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి శ్యామలరావు, పాలక మండలి సభ్యులు, మాజీ ఉపకులపతులు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో రెక్టార్ రమణ, రిజిస్ట్రార్ సుమలత, డైరెక్టర్లు పాల్గొన్నారు.

### 17న ఆర్‌సెట్ స్పాట్ అడ్మిషన్లు

రాజానగరం: ఏపీ ఆర్‌సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు ఆదికవి నన్నయ యూనివర్సిటీలో పరిశోధన ప్రవేశాలకు ఖాళీగా ఉన్న సీట్లలో ఈ నెల 17న స్పాట్ అడ్మిషన్లు జరుగనున్నాయని రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ తెలిపారు. ఖాళీలు, ఫీజు, తదితర వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ని సందర్శించాలన్నారు.

# ప్రైవేటు బడుల్లోనూ ఉచితాసనం

- విద్యాహక్కు చట్టం అమలు దిశగా సర్కారు అడుగులు
- ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల రిజిస్ట్రేషన్ మొదలు
- ఈ నెల 16 వరకు గడువు
- ఉమ్మడి జిల్లాలో ఉన్నవి 1,238... రిజిస్టర్ అయినవి 340



రాయవరం: ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టాన్ని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గత విద్యా సంవత్సరంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 570 మంది విద్యార్థులకు ఒకటో తరగతిలో ప్రవేశం కల్పించారు. విద్యాహక్కు చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం వచ్చే విద్యా సంవత్సరంలో కూడా పక్కాగా అమలు చేసేందుకు ప్రణాళికను అమలు చేస్తోంది. అందులో భాగంగా ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం సెక్షన్12(1)(సి)ని అనుసరించి ముందుగా ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ విద్యాసంస్థలు తప్పనిసరిగా సీఎస్ఈ వెబ్ పోర్టల్‌లో రిజిస్టర్ కావాల్సి ఉంది.

**జిల్లాలో పరిస్థితి ఇదీ..**

విద్యాహక్కు చట్టం ప్రకారం జిల్లాలో ఉన్న 1,238 ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఉచితంగా ఇవ్వాల్సి ఉంది. ఇప్పటి వరకు 340 పాఠశాలలు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సీఎస్ఈ వెబ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్నారు. ఇంకా 898 పాఠశాలలు సీఎస్ఈ వెబ్ పోర్టల్‌లో రిజిస్టర్ కావాల్సి ఉంది. ఈ ప్రక్రియ సమర్థంగా అమలు కావాలంటే ముందుగా ప్రైవేట్ పాఠశాలలు సీఎస్ఈ వెబ్ పోర్టల్‌లో పాఠశాల వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంది. ఇప్పటికే పాఠశాల విద్యాశాఖ జిల్లాల వారీగా ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల జాబితాను ఆయా జిల్లాల విద్యాశాఖాధికారులకు పంపించింది. ఆ జాబితా ప్రకారం జిల్లా విద్యాశాఖాధికారులు, డీవైఈవో, ఎంఈవోలు ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలలను సీఎస్ఈ వెబ్ పోర్టల్‌లో రిజిస్టర్ అయ్యేలా పర్యవేక్షణ చేస్తున్నారు. ఐబీ/ఐసీఎస్ఈ/సీబీఎస్ఈ/స్టేట్ సిలబస్‌లు అమలవుతున్న ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలలు రిజిస్టర్ కావాల్సి ఉంది. ఈ నెల 6వ తేదీ నుంచి ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కాగా, 16వ తేదీతో రిజిస్ట్రేషన్ గడువు ముగియనుంది.

**ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇలా**

| జిల్లా | ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలలు | నమోదైన పాఠశాలలు | నమోదు కావాల్సినవి |
|---|---|---|---|
| తూర్పుగోదావరి | 450 | 159 | 217 |
| కోనసీమ జిల్లా | 343 | 110 | 233 |
| కాకినాడ జిల్లా | 445 | 71 | 374 |

**అడ్మిషన్ మానిటరింగ్ కమిటీల ఏర్పాటు**

విద్యాహక్కు చట్టాన్ని పక్కాగా అమలు చేసే చర్యల్లో భాగంగా డిస్ట్రిక్ట్ అడ్మిషన్ మానిటరింగ్ కమిటీలు ఏర్పాటు చేయాలి. ఫిర్యాదుల పరిష్కారం, ప్రవేశాల కోసం జిల్లా విద్యాశాఖాధికారి పర్యవేక్షణ చేస్తారు. విద్యార్థుల ప్రవేశాల సమయంలో ఏర్పడే ఇబ్బందులను డీఏఎంసీ పరిష్కరిస్తుంది.

**పక్కాగా అమలు చేయాల్సిందే**



ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలలు కచ్చితంగా సీఎస్ఈ వెబ్ పోర్టల్‌లో రిజిస్టర్ కావాలి. ఆయా జిల్లాల్లోని డీవైఈవోలు, ఎంఈవోలు వారి పరిధిలోని ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలలు సీఎస్ఈ వెబ్‌పోర్టల్‌లో నమోదు అయ్యే విధంగా పర్యవేక్షణ చేయాలి.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

ప్రధానంగా డిజ్‌అడ్వాంటేజ్, వెనుకబడిన వర్గాలకు చెందిన పిల్లలకు అడ్మిషన్లలో ప్రాధాన్యం ఉంటుంది. దాని ప్రకారం ఎస్సీ, ఎస్టీ, ఇతర వెనుకబడిన వర్గాలు(నాన్ క్రీమిలేయర్), ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు, హెచ్ఐవీ/ఎయిడ్స్ వ్యాధులతో బాధపడుతున్న చిన్నారులు తదితరులకు అడ్మిషన్లలో ప్రాధాన్యమిస్తారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన పిల్లల తల్లిదండ్రులు రూ.1.20 లక్షల ఆదాయం, పట్టణ ప్రాంతాలకు చెందినవారు రూ.1.44లక్షల లోపు ఆదాయం కలిగి ఉండాలి. స్థానికంగా నివసిస్తున్నట్లుగా పిల్లలు/తల్లిదండ్రులు/గార్డియన్ ఆధార్‌కార్డు లేదా తల్లిదండ్రుల ఓటరు ఐడీ, కరెంటు బిల్లు, డ్రైవింగ్ లైసెన్స్, బియ్యం కార్డు, తహసీల్దారు జారీ చేసిన నివాస ధృవపత్రం ఇలా ఏదో ఒకటి అందజేయాల్సి ఉంటుంది.

### బస్సు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



బస్సు ఢీ కొనడంతో రోడ్డుపై పడిపోయిన మోటార్ సైకిలిస్ట్

దేవరపల్లి: మండలంలోని సూర్యనారాయణపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటారు సైకిల్‌పై వెళుతున్న ఇద్దరు తీవ్రంగా గాయపడి రాజమహేంద్రవరం, కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. స్థానికుల కథనం ప్రకారం కొవ్వూరు నుంచి ఏలూరు వెళుతున్న ఆర్టీసీ బస్సును ఎదురుగా మోటార్ సైకిల్‌పై వస్తున్న ఇద్దరు ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో మండలంలోని యర్నగూడెం గ్రామానికి చెందిన పోలుమాటి కృష్ణ, బొంతా గంగాధర్ తీవ్రంగా గాయపడ్డారు. కృష్ణ తలకు బలమైన గాయం కావడంతో రాజమహేంద్రవరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. గంగాధర్‌కు కాలు విరిగి కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి నుంచి సమాచారం వచ్చిన వెంటనే కేసు నమోదు చేస్తామని ఎస్సై కె.శ్రీహరిరావు తెలిపారు.

# 18న జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం



అధికారులతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ స్థాయీ సంఘాల సమావేశం ఈ నెల 18వ తేదీ ఉదయం 10.30 గంటలకు కాకినాడ జిల్లా ప్రజా పరిషత్ సమావేశపు హాలులో నిర్వహిస్తున్నట్టు చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు తెలిపారు. మంగళవారం తన చాంబర్‌లో వివిధ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బందితో ఆయన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. స్థాయీ సంఘాలలో సభ్యులకు అవసరమైన సహాయ చర్యలు, నిర్వర్తించాల్సిన విధులపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. 1, 2, 4, 7 స్థాయీ సంఘాల సమావేశాలు చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన జరుగుతాయి. ఈ కార్యక్రమంలో ప్రణాళిక విభాగానికి సంబంధించిన అధికారులు పాల్గొంటారు. 3వ స్థాయీ సంఘ సమావేశం వ్యవసాయంపై వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు అధ్యక్షతన ఉదయం 11 నుంచి 11.30 వరకు జరుగుతుందన్నారు. 5వ స్థాయీ సంఘం (స్త్రీ, శిశు సంక్షేమం) చైర్మన్ రొంగల పద్మావతి అధ్యక్షతన ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు జరుగుతుందన్నారు. 6వ స్థాయీ సంఘం (సాంఘిక సంక్షేమం) ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు వైస్ చైర్మన్ మేరుగు పద్మలత అధ్యక్షతన జరుగుతుందని చైర్మన్ వేణుగోపాలరావు వివరించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణ, డిప్యూటీ సీఈవో ఎ.రమణారెడ్డి, మినిస్టీరియల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆర్.రమేష్ పాల్గొన్నారు.

# ఆలయ విద్యాసంస్థల్లో హిందూ ధర్మం

**కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి**



శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామిని కలిసిన దేవస్థానం చైర్మన్ రోహిత్

అన్నవరం: బాలికల కోసం తిరుపతిలో కంచి కామకోటి పీఠం నిర్వహిస్తున్న సంప్రదాయ స్కూల్ తరహాలో అన్నవరం దేవస్థానం విద్యాసంస్థలలో కూడా విద్యార్థులకు హిందూ ధర్మం, ఆచారాలు, సంప్రదాయాలు నేర్పాలని కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి సూచించారు. స్థానిక పంపా సత్రంలో పీఠం వద్ద కంచి పీఠాధిపతిని అన్నవరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కంచి పీఠాధిపతి మాట్లాడుతూ స్వామివారి ఆలయానికి విచ్చేసే భక్తులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. వైదిక పరమైన కార్యక్రమాల నిర్వహణలో ఎటువంటి రాజీ పడవద్దని సూచించారు. దేవస్థానం వేద పండితులు చిట్టి శివ, ముష్టి పురుషోత్తం, ఏఈఓ డీవీఎస్ కృష్ణారావు, సూపరింటెండెంట్ రమణ, అర్చకులు దత్తాత్రేయ శర్మ పాల్గొన్నారు. కాగా రెండో రోజు మంగళవారం కూడా పంపా సత్రంలో కంచి పీఠాధిపతి అమ్మవారికి ప్రత్యేక పూజలు, శ్రీచంద్రమౌళీశ్వరునికి అభిషేకం నిర్వహించారు. అనంతరం మంగళవారం సాయంత్రం అనకాపల్లి జిల్లా నర్సీపట్నం బయల్దేరి వెళ్లారు. మళ్లీ బుధవారం రాత్రికి అన్నవరం చేరుకుంటారని దేవస్థానం అధికారులు తెలిపారు. స్వామి, అమ్మవార్లకు పూజలు, అభిషేకాలు, త్రికాలార్చనలు పంపా సత్రం వద్ద గల పీఠం వద్ద అర్చకస్వాములు యథావిధిగా నిర్వహిస్తారు.

# ఆపద మిత్రలకు శిక్షణ అదనపు అర్హత

**ఈటీసీ ప్రిన్సిపాల్ వేణుగోపాల్**



ఈటీసీలో ఆపద మిత్రల శిక్షణలో మాట్లాడుతున్న వేణుగోపాల్

సామర్లకోట: ప్రకృతి వైపరీత్యాల పట్ల ఆపద మిత్రలు అప్రమత్తంగా ఉండే విధంగా శిక్షణ ఇస్తున్నామని, ఇది వారికి అదనపు అర్హతగా ఉంటుందని ఈటీసీ ప్రిన్సిపాల్, జెడ్పీ డిప్యూటీ సీఈఓ జె.వేణుగోపాల్ అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో మంగళవారం కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాలోని ఆపద మిత్రలకు 12 రోజుల పాటు నిర్వహించే శిక్షణను ఆయన ప్రారంభించారు. వలంటీర్లు, ఆశా వర్కర్లు, ఎన్‌సీసీ విద్యార్థుల నుంచి ఉత్సాహంగా ఉన్న వారిని ఆపద మిత్రలుగా ఎంపిక చేశామన్నారు. ప్రమాదాలు జరిగిన సమయంలో బాధితులను ఆదుకొనే విధంగా ఆపద మిత్రలు పని చేయవలసి ఉంటుందన్నారు. ఈ మేరకు ఆయా శాఖలో అనుభవం కలిగిన డాక్టర్లు, అగ్నిమాపక శాఖ, రెవెన్యూ, పంచాయతీరాజ్‌శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, విపత్తుల శాఖలకు చెందిన అధికారులు శిక్షణ ఇస్తారని చెప్పారు. వారు తెలియజేసే ప్రతీ అంశాన్ని క్షుణంగా గమనించాలన్నారు. ఆపద మిత్రలపై రోజుకు రూ.500 చొప్పున 12 రోజులకు రూ.ఆరువేలు ఖర్చు చేస్తున్నామన్నారు. ఆపదలో ఉన్నవారిని రక్షించడానికి, తమను తాము రక్షించుకోవడానికి ప్రభుత్వం రూ.10 వేల విలువ చేసే కిట్లను ఆపద మిత్రలకు శిక్షణ పూర్తి అయిన తరువాత అందజేస్తుందని తెలిపారు. ఈ శిక్షణలో రెండు రోజుల ఫీల్డు విజిట్ ఉంటుందన్నారు. ఎస్‌డీఆర్ఎఫ్ అధికారులు ప్రమాదాలపై శిక్షణ ఇస్తారని తెలిపారు. ఈటీసీలో కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి, అనకాపల్లి జిల్లాల ఆపద మిత్రలకు శిక్షణ ఇస్తామని చెప్పారు. ఎస్‌డీఆర్ఎఫ్ అధికారి ఛాంద్‌కుమార్, ఈటీసీ ఫ్యాకల్టీలు ఎంఎస్ఎన్ రెడ్డి, వెంకటేశ్వరరావు, ఎస్‌కే మెహీద్దీన్ శిక్షణ నిర్వహించారు.



### సీనియర్ రెసిడెంట్ పోస్టుకు 18న ఇంటర్వ్యూ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్య కళాశాలలో సీనియర్ రెసిడెంట్ నియామకానికి ఈ నెల 18న ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఓబీజీ, అనస్తీషియా, ఆర్థోపెడిక్, ఆప్తమాలజీ, ఈఎన్‌టీ, రేడియాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్, బయోకెమిస్ట్రీ, ఫార్మకాలజీ, మైక్రో బయాలజీ, పాథలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, ఎస్‌పీఎంలకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు పదో తరగతి సర్టిఫికెట్, ఎంబీబీఎస్, పీజీ, డిగ్రీ ధ్రువపత్రాలు, పీజీ మార్కుల లిస్టు, సోషల్ స్టేటస్ ధ్రువపత్రం, ఆధార్ కార్డు, 4 నుంచి 10వ తరగతి వరకూ ధ్రువపత్రాలు తీసుకురావాలని సూచించారు.

### గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

అమలాపురం రూరల్: కామనగరువు బైపాస్ రోడ్డులో చిందాడగరువు జంక్షన్ వద్ద అక్రమంగా గంజాయి అమ్ముతున్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు అమలాపురం ఎస్సై అందే పరదేశి తెలిపారు. తాలూకా ఎస్సై ఆధ్వర్యంలో తహసీల్దార్ పరమట శ్రీపల్లవితో కలిసి పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో సమనస గ్రామానికి చెందిన , దారా కిరణ్, కామనగరువు అబ్బిరెడ్డి రామదాసు కాలనీ చెందిన నెలం లోవరాజులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.67,170 విలువైన 22.390 కేజీల గంజాయి, రెండు మొబైల్ ఫోన్లు, రూ.200 నగదును స్వాధీనం చేసుకునట్టు తెలిపారు. మంగళవారం వారిని కోర్టులో హాజరు పరుచగా 14 రోజుల రిమాండ్ విధించినట్టు తెలిపారు.

క్రైం కార్నర్..

# జ్యూస్‌లో మత్తు మందు కలిపి ఇచ్చి చోరీ

- నగదు, బంగారం అపహరణ
- క్లూస్ టీం పరిశీలన



ఆటోలో అపస్మారక స్థితిలో ఉన్న మహిళను ఆసుపత్రికి తరలిస్తున్న స్థానికులు



ప్రాథమిక దర్యాప్తు చేస్తున్న క్లూస్ టీం, పోలీసులు

ఐ.పోలవరం: మండలంలోని మురమళ్లలో ఇద్దరు మహిళలకు జ్యూస్‌లో మత్తుమందు కలిపి ఇచ్చి నగదు, బంగారం దోచుకుపోయారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో కాశీ వారి వీధిలో కాశీ పాణి రమేష్ ఇంటిలో సోమవారం రాత్రి తల్లి కాశీ మణి కళావతి, పొరుగింటి మహిళ చింతలపూడి గవరమ్మ టీవీ చూస్తూ ఉన్నారు. కళావతికి వరుసకు మనుమరాలు అయిన అమ్మాయి ఇంటికి వచ్చి జ్యూస్ ఇచ్చింది. కాసేపటికే వారిద్దరూ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. ఇంటి బీరువాలో ఉన్న రూ.10వేలు, మూడు తులాల బంగారు తాడు మాయమయ్యాయి. ఉద్యోగ రీత్యా కళావతి కుమారుడు రమేష్ యానాంలో ఉంటున్నాడు. రాత్రి తల్లికి ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. మంగళవారం ఉదయం కూడా ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానం వచ్చి చుట్టుపక్కల వారికి ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకొన్నాడు. వారు ఇంటి తలుపులు తెరచి ఉన్నాయని తెలపడంతో ఇంటికి వచ్చి చూసే సరికి అపస్మారక స్థితిలో తల్లి, పొరుగింటి మహిళ ఉండటాన్ని గమనించాడు. దీంతో పాణి రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. స్థానిక ఎస్సై ఎస్.రాజేష్ సిబ్బందితో కలసి ఘటనా స్థలానికి చేరుకొని ప్రాథమిక దర్యాప్తు నిర్వహించారు. క్లూస్ టీం వచ్చి వేలిముద్రలు, కొన్ని ఆధారాలు సేకరించింది. అపస్మారక స్థితిలో ఉన్న ఇద్దరు మహిళలను చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# కోలుకుంటున్న 'పొగ' బాధిత విద్యార్థులు



అమలాపురం ఏరియా ఆస్పత్రిలో కోలుకుంటున్న విద్యార్థులు

అమలాపురం రూరల్: ప్లాస్టిక్ వ్యర్థాలతో కూడిన చెత్తను తగులబెట్టడంతో ఏర్పడ్డ దట్టమైన పొగతో తీవ్ర అస్వస్థతకు గురైన బండార్లంక విజడమ్ స్కూలు విద్యార్థులు క్రమంగా కోలుకుంటున్నారు. సోమవారం ఘటన జరిగిన వెంటనే అత్యవసర వైద్యం కోసం అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించిన 15 మంది విద్యార్థుల్లో 12 మందిని సోమవారం రాత్రే డిశ్చార్జి చేశారు. మిగిలిన ముగ్గురు విద్యార్థులు మంగళవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వారి ఆరోగ్యం కుదుట పడిందని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు తెలిపారు.కలెక్టర్ హిమాన్షు శుక్లా, డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావు దొర, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల సమన్వయ కర్త డాక్టర్ పద్మశ్రీరాణి ఆధ్వర్యంలో బాధిత విద్యార్థులకు అత్యవసర వైద్యం అందించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో అస్వస్థతకు గురైన మరో ఇద్దరు విద్యార్థులు బండార్లంక పీహెచ్‌సీలో చికిత్స పొంది సోమవారం రాత్రి డిశ్చార్జి అయ్యారు. మొత్తంలో ఈ ప్రమాదంలో అందరూ సురక్షితంగా కోలుకుని క్షేమంగా ఇళ్లకు చేరుకుంటుండంతో బండార్లంక గ్రామస్తులు ముఖ్యంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

### విద్యుత్ షాక్‌తో రైతు మృతి



రైతు నరసింహారావు (ఫైల్)

గోపాలపురం: విద్యుత్ షాక్‌కు గురై రైతు మృతిచెందిన ఘటన గోపాలపురం మండలం వెంకటాయపాలెంలో చోటు చేసుకుంది. గోపాలపురం ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం సోమవారం రాత్రి గ్రామానికి చెందిన మద్దిపాటి నరసింహారావు(50) తన పొలంలో మోటార్ స్టార్టర్ ఆన్‌చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తూ విద్యుత్ వైరు తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని భార్య బేబీ సరస్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### బాలిక కిడ్నాప్‌పై కేసు

గండేపల్లి: బాలిక కిడ్నాప్‌పై కేసు నమోదు చేసినట్టు గండేపల్లి ఎస్సై వై.గణేష్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల మేరకు మండలంలోని కె.గోపాలపురానికి చెందిన 14 సంవత్సరాల బాలిక గండేపల్లి హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతోంది. అదే గ్రామానికి చెందిన వేమగిరి సత్యానందం కొంతకాలంగా బాలిక వెంటపడుతూ వేధిస్తున్నాడు. మందలించిన పెద్దల మాటను లెక్క పెట్టక వెంటపడుతూనే ఉన్నాడు. ఈ నెల 7వ తేదీన స్కూల్‌కు వెళ్లేందుకు ఆటో కోసం ఇంటి బయట వేచి ఉన్న బాలికకు సత్యానందం మాయమాటలు కిడ్నాప్ చేశాడు. బాలికను సత్యానందమే కిడ్నాప్ చేసినట్టు గ్రామంలో తెలియడంతో మరుసటిరోజు బాలికను గ్రామంలోకి తీసుకువచ్చినట్టు తెలియజేశారు. బాలిక తల్లి కోడి నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.